# అసమర్థుని సంఘర్షణ

రచన :
శ్రీ బి. నాగోజిరావు.

"ఏమిటీ, చేతికొచ్చింది కాదన్నావా?" నమ్మలేనట్టు ముఖంపెట్టి అడిగాడు అప్పారావు. రామారావు ఏమీ మాట్లాడలేదు. గంభీరంగా ఏదో ఆలోచిస్తున్నాడు. సామాన్యంగా అతనెప్పుడూ గంభీరంగానే ఉంటాడు. సాధారణంగా ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడడు. అవసరమొస్తేనే అదీను! అందుకే రామారావంటే అందరికీ అదోలా ఉంటుంది. అతని దగ్గర చేరరు. రామా రావు రూమ్‌మేట్ అప్పారావు. అతడు పూర్తిగా రామారావుకు వ్యతిరేకి. రామారావు ఎంత మిత భాషో—అప్పారావు అంత అమితభాషి. అంతే కాకుండా ఆ ఇద్దరి అభిప్రాయాలూ, అభిరుచులూ కూడా వేర్వేరు! ఆ ఇద్దరూ ఒకే రూములో ఉండడం నిజంగా ఆశ్చర్యకరమైన విషయమే !

× × ×

ఆవేళ జరిగిన ఓ సంఘటన రామారావుకు ఓపరీక్షగా కనబడసాగింది. దానివల్ల మనస్సు ఎంతో హాయిగా ఉంది. ఆవేళ కాలేజీనుంచి వస్తూ రామారావు ఒక కాఫీ హోటలుకు వెళ్ళాడు. స్వర్వర్ వచ్చి సవినయంగా అడిగాడు—"ఏం కావాలి సార్?" నిజానికి రామారావుకి అప్పుడు చాలా ఆకలిగా ఉంది. ఉండదూమరి! ఉదయం తొమ్మిది గంటలకు తిన్నతిండి! అందుకని, తింటే టిఫినెంతైనా తినగలడు. కాని అతని దగ్గరున్నది ఒకే ఒక్క రూపాయి. ఇంటిదగ్గరనుంచి డబ్బు మళ్లీ మూడు రోజులవరకు రాదు. అందుచేత ఈ రూపాయినే అంతవరకు సర్దుకోవాలి. కాఫీ మాత్రమే తీసుకుంటే ఆకలి ఆగుతుందా?

అందుకని, "రెండిడ్లీ పట్రా !" అని ఆర్డరు జారీ చేశాడు. సర్వరు వెళ్లిపోయాడు. రామారావు ఆలోచనలోపడ్డాడు. నిజానికి తన దగ్గర ఇప్పుడు పదకొండు రూపాయలు ఉండవలసింది ! అవే ఉంటే, తను హాయిగా, ఏబాధలేకుండా మళ్ళీ ఇంటి దగ్గరనుంచీ డబ్బొచ్చేవరకు గడిపేవాడు. కాని—తనకా అదృష్టం లేదు. నిజంగా తను దురదృష్టవంతుడు. నిన్న తను చాకలి తెచ్చిన ఇస్త్రీ గుడ్డలు తొడుక్కొని పాత పేంటులోని వస్తువుల్ని ఈపేంటులోకి రవాణా చేశాడు. అప్పుడు ఒక పదిరూపాయల నోటూ, ఒక్క రూపాయినోటూ కూడా స్థానచలనం చెందాయి. అది జరిగిన తరువాత తనకా పదిరూపాయలు జేబులో ఉన్నాయన్న జ్ఞాపకమేలేదు. ఈవేళ ఉదయం స్ఫురణకి వచ్చి చూసుకుంటే—ఏముందీ? అదిలేదు! ఒక్క రూపాయి మాత్రం ఒంటరిగా తనని చూసి వెక్కిరించింది! తనకు ముచ్చెమటలు పోశాయి. 'పదిరూపాయలు ఒక్కసారి పోవడమా?' అని ఒకటే ఆందోళన. మళ్ళీ జాగ్రత్తగా వెదికాడు, ఊహుం లేదు. బహుశా రూంలోనే వదిలేశాడేమోనని రూమంతా తెగవెదికాడు. పాత పేంటులో, పుస్తకాలలో, పెట్టెలో, డైరీలో ఒక్కదగ్గరేమిటి? అంతటా వెదికాడు. గాని ఫలితం శూన్యం! అసలు అది రూంలో ఉంటేకదా దొరడానికి. తను పేంటులో పెట్టుకోడం బాగాజ్ఞాపకం— తరువాత ఏమయిందితెలీదు. కనీసంతనకు పదిరూపాయల గురించి జ్ఞాపకం ఉన్నా—అది ఎక్కడో, జారిపోకమునుపే జాగ్రత్తపర్చి ఉండేవాడు. కాని అంత అదృష్టమా తనకు? ఇకమిగిలింది ఈ ఒక్కరూపాయి. దీనితోనే గడపాలి ఈ మూడ్రోజులూ అని నిట్టూర్చాడు.

ఆలోచనలనుండి బయటకు వచ్చేసరికి టేబిలుమీద రెండిడ్లీ ఎదురు చూస్తున్నాయి. పట్టుకొని చూస్తే చల్లగా చల్లారిపోయివున్నయ్. అంటే ఎప్పుడో తను ఆలోచనలలో ఉండగానే పడేసి వెళ్లిపోయాడన్న మాట! అతడికి సెర్వర్‌మీద ఎనలేనికోపం వచ్చింది. అవి మార్పించేసి వేడివి తెప్పించుకోవాలనుకున్నాడు. కాని సర్వరుతో మాటలు పెంచదలచుకోలేదు. ఎలాగో ఆ రెంటిని కడుపులోకి రవాణా చేశాడు.

మళ్లీ సెర్వర్ ప్రత్యక్షం!! 'వరుడా, ఏమినీకోరిక ?' అన్నట్లు పోజుపెట్టి. సెర్వర్‌ని చూసిన రామారావుకి మళ్లీకోపం వచ్చింది. అయినా తమాయించుకొని "కాఫీ!" అన్నాడు. సెర్వర్ లోనికి పరుగెత్తాడు.

'ఈ హోటల్ నానాటికీ చెత్తగా తయారవుతోంది.' అని అనుకున్నాడు రామారావు. మొదట్లో అంటే తను కాలేజీలో జాయినయిన కొత్త అన్నీ బాగానే ఉండేవి. ఖరీదులుకూడా సాధారణంగానే ఉండేవి. కొంతకాలానికి అదనీ, ఇదనీ, చెప్పి ఖరీదులన్నీ పెంచేశాడు ఆ సాంబారు అయ్యర్! పోనీ ఖరీదులు పెరిగాయికదా, పదార్థాలైనా బాగులేవు. పరిమాణం సగానికి సగమైనది, రేటు రెండు రెట్లైతే__! ఇంకా ఎంతకు పెరుగుతుందో?

సెర్వర్ కాఫీ తీసుకవచ్చి టేబిలుపైన ఉంచాడు. కాఫీ అట్టే వేడిగాలేదు. ఐనా నోట్లో పోసుకున్నాడు. అసలు కాఫీవాసన ఉంటేకద! అదోవాసన! 'తనకు చిన్నప్పుడు జలుబుచేస్తే నాయనమ్మచేసి ఇచ్చేది, ఏదో కషాయమని__ఇంకా అదేనయం. తీయతీయగా కారం కారంగా ఉండేది. వెధవకాఫీ__' అని నిట్టూర్చాడు. కోపంగా సెర్వర్ వైపు చూశాడు. సెర్వర్ అతడి చూపులకు హడలిపోయి, బిల్లురాసే నెపంతో తలదించుకున్నాడు. బిల్లు రామారావు చేతికొచ్చింది. నలభై పైసలు!! 'కుడుం ముక్కలకీ __ కషాయానికీ నలభై పైసలు' అని నవ్వుకుని లేచాడు రామారావు.

జేబులోంచి రూపాయితీసి, బిల్లుతో జతచేసి టేబిలుమీద పెట్టాడు. చిల్లరకోసం తెరిచి ఉంచిన చెయ్యి టేబిలుమీద ఉంచి ఏదో ఆలోచించసాగాడు. చేతిలో పడింది చిల్లరకాక ఇంకా ఏదో అయేసరికి విభ్రాంతుడై చూసుకున్నాడు. రామారావు తన కళ్లను తానే నమ్మలేకపోయాడు. అతడి చేతిలో ఉన్నవి చిల్లర నాణేలు కావు! చిల్లర కాగితాలు! లెక్కచూస్తే తొమ్మిది! ఇంకా టేబిలుమీద అరవై పైసలు ఉన్నాయి. రామారావుకేమీ అంతు తెలియలేదు. ఒకవేళ తనప్రక్కనున్న వాడికి ఇవ్వబోయి అయ్యరు తనకు ఇచ్చేశాడేమోనని ప్రక్కకు తిరిగి చూశాడు. అక్కడ ఎవరూలేరు. మరి ఎవరికి ఇచ్చినట్లు? తనకేనేమో? తనకెందుకు ఇస్తాడు? తను ఒక్క రూపాయేకదా ఇచ్చాడు. తనకు అరవై పైసలు మాత్రమే రావాలి! ఇప్పుడు వాడిచ్చినవి చూస్తే...తొమ్మిది రూపాయల ... అరవై పైసలు! రామారావుకి అర్థమయింది. ఆ అయ్యరు తను పది రూపాయలనోటు ఇచ్చాడనుకొని అంత మొత్తం ఇచ్చేశాడు. అదీసంగతి! అని అనుకున్నాడు.

రామారావులో మానవ సహజమైన దురాశపుట్టింది. స్వార్థం అతడిని హెచ్చరించింది. "ఇదే మంచి తరుణం. ఇంత అదృష్టం మళ్లీరాదు. తీసుకో!" అని అరవసాగింది. రామారావుకూడా స్వార్థం హెచ్చరికకు లోబడిపోయాడు. తనకెలాగూ ఇప్పుడు డబ్బులేదు. హాయిగా ఇవి ఖర్చుపెట్టుకోవచ్చు - ఊరకనే వస్తువుంటే ఎందుకు కాదనాలి? అని అనుకున్నాడు వెంటనే తీసుకోవడానికి సంసిద్ధమయాడు.

కానైనే అతడి అంతరాత్మ ఊరుకోలేదు. అది తీవ్రంగా స్వార్థాన్ని ఎదుర్కొంది. మంచిని గురించి బోధించింది. "ఛీ! చదువుకున్నవాడివి, నీవు చేయవలసిన పని ఇదేనా? డబ్బుకోసం కక్కుర్తిపడి చివరికి ఇంత హీనంగా ప్రవర్తిస్తావా?" అని అంది. అంతరాత్మ మాటలలోని నిజాన్ని గ్రహించాడు రామారావు. 'అవును. ఈ డబ్బు తీసుకోకూడదు. వెధవది దొంగచాటుగాతీసుకోడమా? స్వయంగా తనకే వాడు ఇచ్చాడనుకో, అయినా సరే తను తీసుకోకూడదు. తనకు న్యాయంగా రావలసినదే తీసుకుని,మిగతాది ఇచ్చేస్తాను' అని నిర్ణయించుకుని తొమ్మిది రూపాయలూ ఇచ్చేయబోయాడు.

స్వార్థం గట్టిగా మూలిగింది. ఎలాగైనా అతడు తన మాటకే లొంగిపోవాలని అనుకుంది. ఎలాగో ఒకలాగ ఒప్పించడానికి నిశ్చయించుకుంది. మంచి మాటలతో తనవైపు త్రిప్పుకోవాలని, "చూడు - ఈ అయ్యరు నీకెంత మోసం చేయలేదు. ఖరీదు ఇష్టంవచ్చినట్లు పెంచి, రుచిలేనివన్నీ ఇచ్చి ఎంతలాభం తీశాడు. సగానికిసగం లాభంకిందే తీసుకున్నాడు. ఇప్పుడా లాభంలో కొంచెం మాత్రమే నీచేతిలో పడబోతుంది. తీసుకోవడంలో అన్యాయం ఏముంది?" అని గట్టిగా నచ్చచెప్పింది. రామారావు మనస్సు స్వార్థంతో ఏకమైంది. "అదీ నిజమే! తన దగ్గర ఎంతడబ్బు లాభం తీశాడనీ__ అందులో కొంచెం తీసుకుంటే తప్పేముంది? అదీగాక స్వయంగా అయ్యరే ఇస్తున్నాడు. తానేమీ దొంగిలించడం లేదుకదా?" అని మనస్సుకు సర్ది చెప్పాడు. మనస్సూ ఒప్పుకొంది. మనస్సు ఆజ్ఞప్రకారం చెయ్యి మెల్లగా వెనక్కి రాసాగింది!

అంతరాత్మకు స్వార్థంమీద ఎక్కడలేని కోపమూ

వచ్చింది. అది ఎలాగైనా సరే రామారావును తప్పు త్రోవపట్టకుండా కాపాడడానికి నిశ్చయించుకుంది. ముందు స్వార్థానికి తగినట్టు బుద్ధి చెప్పాలని, కోపంతో "ఛీ! పాడుస్వార్థం! నీబుద్ధి ఎప్పుడూ ఇంతే! ఊరకనే వస్తున్నాయి కదా, అని కుతంత్రంగా తీసుకుంటావా? ఆ అయ్యరు ఏదో మోసం చేశాడని - నువ్వూ చేస్తావా? వాడు మోసంలో పండిపోయాడు. నువ్వూ అలాగే చేసి మోసగాడివౌతావా? కాబట్టి వాడి కిచ్చెయ్!"

అంతరాత్మకోపానికి రామారావులోని స్వార్థం గడ గడ వణికింది. ఏమీమాట్లాడలేక నోరుమూసుకుంది. అప్పుడు రామారావు తను చేయబోయే తప్పిదాన్ని గుర్తించాడు. 'ఛీ—స్వార్థంతో నేనెంత పనిచేయబోయాను. అవును-వాడేదో మోసం చేశాడని తను చేస్తాడా? ఛ! తను ఇంత చదువుకొని ఎందుకు?' అని పశ్చాత్తాపపడి ఆడబ్బు తిరిగి ఇచ్చేయడానికి నిశ్చయించుకున్నాడు.

ఈసారి చెయ్యి ముందుకు నడిచింది. నోరు ఏదో అనబోయింది. స్వార్థానికి మతిపోయినంతపనైంది. అమూల్యావకాశం చేయిజారిపోతున్నట్లయింది. నీరసించిన స్వార్థం తిరిగి విజృంభించింది. మెల్లిగా గుసగుసలాడుతున్నట్టుగా ఇలా మనస్సుకు నచ్చచెప్పింది, "ఆ అంతరాత్మ మాటవిని ఎందుకు చెడిపోతావ్? అంతరాత్మ ఎప్పుడూ న్యాయం, నిజాయితీ అని అంటుది గాని సుఖం చూడదు. నిజాయితీగా ఉండి మలమల మాడాలంటుంది...ఆ డబ్బుచూడు. ఎలా మెరుస్తుందో? హాయిగా పదిరోజులు సుఖంగా ఉండొచ్చు." గాని స్వార్థంమాట మనస్సు పట్టించుకోలేదు. అది అంతరాత్మ చెప్పిందే సబబని నమ్మింది. అందుకని ఏమీమాట్లాడలేదు. ఆడబ్బు ఇచ్చేయడానికి సిద్ధపడింది.

ఈసారి స్వార్థానికి ఏడుపు వచ్చినంతపనైంది. "అనవసరంగా తనమాట పోతుందే" అని బాధపడింది. ఈ

(తరువాయి 51వ పేజీలో)


పయోనీర్ పేపర్ కటింగ్ మెషిన్లు!!

* చక్కని పనితనానికీ
* చిరకాల మన్నికకూ గ్యారంటీ.



సైజులు : — 18" — 26" — 32" — 36"
తృప్తికరముగా పనిచేసే చక్కని మెషిన్లు.

*



పయోనీర్ సెంట్రిఫ్యూగల్ పంపులు.
(బెల్ట్ డ్రివన్)

స్పీడు : - 900 నుంచి 2000. R. P. M. వరకూ.

: వివరములకు :

PIONEER FOUNDRY
(Phone No. 6103 :: Grams : "PRINTREEL")
PATEL ROAD, COIMBATORE-9.

(47వ పేజీ తరువాయి]

సారి మరోవిధంగా మొదలుపెట్టింది. "మంచిగా చెప్తే నీకు తలకెక్కుతుందా? కానీ-జరగనీ-డబ్బులేక నువ్వే బాధపడతావ్. "ఆకలి! ఆకలి" అని ఒకటే ఆక్రోశిస్తావు. అదీగాక నిన్న నీ పదిరూపాయలు పోయింది జ్ఞాపకం ఉందా? ఇప్పుడు భగవంతుడే దానికి బదులుగా తిరిగి ఈ విధంగా ఇస్తున్నాడు. సందేహించకు. తీసుకో-" అని చెప్పింది.

'స్వార్థం చెప్పిన దానిలో నిజం లేకపోలేదు—' అని భావించింది రామారావు మనసు. "ఇంతవరకు జ్ఞాపకమే లేదు. తన పదిరూపాయలు నిన్నపోయాయి. ఇప్పుడు తొమ్మిది రూపాయలు ఊరకనే వస్తున్నాయి. ఇంతకు ముందెప్పుడైనా ఇలా జరిగిందా? అయ్యరు ఊరకనే డబ్బిచ్చాడా? ఊహూఁ లేదు. అంటే నిన్న ఆడబ్బు పోవడానికీ, ఈవేళ ఇలా రావడానికి సంబం ఉంది. ఖచ్చితంగా ఈసొమ్ము తనదే-కాబట్టి తీసుకోవచ్చు—" అని నిర్ణయించుకున్నాడు. చెయ్యి బాగా వెనక్కు వచ్చింది. ఇక అక్కడినుంచి బయటపడడమే తరువాయి!

అంతరాత్మ ఈ అన్యాయాన్ని చూస్తూ ఊరుకోలేకపోయింది. 'ఎలా సమర్థించుకున్నాడు!' అని ఆశ్చర్యపోయింది. 'నిన్న పోవడమేమిటి ? ఈవేళ రావడమేమిటి? నీ పోయిన సొమ్ము అయ్యరు దగ్గర ఉందా ? వాడిప్పుడిలా ఇవ్వడానికి ! నిన్న ఎక్కడో పారేసుకున్నావ్—ఇప్పుడు అయ్యరేదో పొరపాటుగా ఇయ్యబోతే నీ సొమ్మేనని తీసుకుంటావా ? సిగ్గులేదూ ? భగవంతుడిచ్చినదైతే ఇలా ఇస్తాడా? ఏ లాటరీలోనో గెల్చినావనో, లేక కథల బహుమతి వచ్చినటో వస్తుందిగాని ఇలాపరోక్షంగా ఇస్తాడా?ఇవి ఎంత మాత్రం భగవంతుడిచ్చినది కాదు. ఇలా తీసుకోడం దొంగతనమే అవుతుంది. దొంగకూ-నీకూ ఏఁవీ తేడాలేదు. దొంగ, చూడకుండా తీసుకుంటాడు. నువ్వు అయ్యరు చూస్తూనే తీసుకుంటున్నావు.' అని ఘోరంగా విమర్శించింది.

తాను దొంగ అనే ఊహకు రాగానే రామారావుకి ఎక్కడలేని అసహ్యమూ కలిగింది. "తను దొంగిలిస్తున్నాడా ? ఇంతవరకూ ఎప్పుడూ తనా పాడుపని చేయలేదు. అదంటేనే తనకు అసహ్యం. ఇప్పుడీ పనిచేసి కళంకం తెచ్చుకుంటాడా? వద్దు-వద్దు. ఈ పాపిష్టిసొమ్ము తనకువద్దు.కావలిస్తే పస్తుఐనా ఉంటాను ఈ పాడుపని చేయను. ఈ డబ్బు ఇచ్చేస్తాను." అని తీవ్రంగా బాధపడి ఆడబ్బు ఇచ్చేయబోయాడు.స్వార్థం ఇంకా మూలుగుతూనే ఉంది. ఏదోవినబడీ, వినబడనట్టు అంటోంది. అయినా రామారావు దానిమాటవినదలచుకోలేదు.

చివరికి స్వార్థం-అంతరాత్మల సంఘర్షణలో అంతరాత్మలో ఏకీభవించింది. తనను పాపపు పాచిలోంచి బయటకు లాగినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంది.

రామారావు అయ్యరుతో, "చూడండీ-ఈ తొమ్మిది రూపాయలు పొరపాటున నాకిచ్చేసినట్టున్నారు. నేనిచ్చినది ఒక్కరూపాయే!" అన్నాడు. ఆ సొమ్ము భద్రంగా టేబిలుపైన ఉంచాడు. "ఆ!" అని ఆశ్చర్యపోయాడు అయ్యరు. అంత నిజాయితీపరుడ్ని ఎవ్వడ్నీ ఇంతవరకు ఎక్కడా చూడలేదు. రామారావు,అయ్యరు ఆశ్చర్యానుంచి తేరుకోక మునుపే చిల్లర జేబులో వేసుకొని బయటికొచ్చాడు.

బయటికొచ్చినాక కూడా స్వార్థం ఊరుకోలేదు. అతడు చేసిన మంచిపనిని అది 'అసమర్థతగా' తీసుకుంది- 'నీ వెందుకూ పనికిరానివాడివి. అందుకే చేతికొచ్చింది కాదన్నావు. నీవంటి అసమర్థుడింకొకడుండడు. సరేలే అంతా నీ ఖర్మ' అని నోటికి వచ్చినట్లల్లా వారించింది. రామారావుకు చికాకుకలిగింది. జేబులోని చిల్లర నాణేలు వెక్కిరించినట్లు 'గొల్లు'మన్నాయి. ఎప్పుడయినా చెడ్డపనంటేనే ఇష్టంకదా! 'ఛ! తను తప్పుపని చేశాడు. ఆడబ్బు తీసుకుంటే ఏఁపోయింది! ఎవడైనాచూశాడా? అంతడబ్బు మళ్ళీ ఊరకేవస్తుందా ? తనెంత అసమర్థుడు! నీతిగా, నిజాయితీగా ఎవడుఉండగలడు? మాడిచావడానికా?— ధైర్యంగా తీసుకోవలసింది. తనకు ధైర్యమూలేదు—అందుకే సుఖమూలేదు.' అని బాధపడ్డాడు.

కానీ అతడి అంతరాత్మ ఓ పక్క ఊరడించుతూనే ఉంది. 'ఆడబ్బు తీసుకుంటే తరవాత తరవాత నువ్వే బాధపడతావ్. ఆడబ్బు ఖర్చుచేస్తున్నంతసేపూ సుఖం

గానే ఉంటుంది. తీరా అది అయిపోయాక నీకు నీవు చేసిన తప్పు బోధపడుతుంది. ఎంతో బాధపడతావ్. ఆబాధ నీ హృదయాన్ని కోసివేస్తుంటుంది. 'ఎందుకు తీసుకున్నానా?' అని ఒకటే ఆందోళనపడతావు. దాని వల్ల వచ్చే సుఖంకన్నా తరవాత వచ్చే దుఃఖం— పశ్చాత్తాపమే ఎక్కువవుతుంది. 'కాబట్టి తీసుకోకపోవడమే చాలా మంచిది' అని ఊరడించింది. రామారావుకు అర్థమయింది. ఒక మంచిపని చేసినందుకు హాయిగా ఊపిరి పీల్చాడు.

రామారావు అనుకోకుండానే ఈ కథంతా అప్పారావుకి చెప్పేశాడు. నిజానికి అతడికి చెప్పాలనుకోలేదు. గానీ మనస్సు మనం చెప్పినట్టువినదు. ఒద్దనుకుంటూనే చెప్పేదాకా మనసు శాంతించిందికాదు.

అంతావిన్న అప్పారావు నిట్టూర్చి, "నీవంటివాడినెక్కడానేను చూడలేదు." అన్నాడు.

"ఏం?" అని అడిగాడు రామారావు.

"ఈ కాలంలో నీతీ, నిజాయితీ అంటూ మడికట్టుక్కూచున్నవాడెవడు? దొరికిందల్లా తిన్నవాడే ప్రయోజకుడు."

"అంటే నీ ఉద్దేశ్యం... నేనప్రయోజకుడ్నా...?"

"కాదు అసమర్థుడివి—" అన్నాడు అప్పారావు గట్టిగా.

"అసమర్థుడువి కాబట్టే కలిసివచ్చిన అదృష్టంను వదిలిపెట్టి చేక్కావచ్చావు. అదే నేనయితేనా...గప్ చిప్ గా తీసుకుని ఖర్చుపెట్టుకోనూ? అందుకే అలాటి అవకాశాలు నాకురావు. నీలాటి దద్దమ్మకొస్తాయి." అని దీర్ఘంగా విచారించాడు.

రామారావు ఇంకా అతడితో మాటలు పెంచదలచుకోలేదు. అతడు తను చేసినపనికి ఇచ్చిన బిరుదు 'అసమర్థుడు' అన్నదానికి నవ్వుకున్నాడు — 'అవును అన్యాయంగాను, అక్రమంగానూ తనేమీ చేయలేదు. ఆ విషయంలో తను అసమర్థుడే!' అతడి పెదవినుండి ఈ రెండే రెండు ముక్కలు వెలువడ్డాయి.

"అవును నేనసమర్థుణ్ణే!"



జెమినీవారి "ఆడబ్రతుకు"లో ఎన్. టి. రామారావు - దేవిక.